ప్రజాశక్తి
బుధవారం 16 ఆగస్టు 2023
5
అల్లూరి సీతారామరాజు



మాదక ద్రవ్య రహితమే లక్ష్యం

ప్రజాశక్తి -పాడేరు: మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సూచించారు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం నిషా ముక్త భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించి, బ్యానర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో మాదక ద్రవ్యాల అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, మాదక ద్రవ్యాలపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వాలంటీర్లను తయారు చేయడం, వారి ద్వారా విద్యాలయాలు, గ్రామాలలో యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించి, వారి భాగస్వామ్యంతో జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తయారు చేయడమే లక్ష్యమని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి తుహిన్ సిన్హా, ఐటిడిఎ పిఒ వి. అభిషేక్ పాల్గొన్నారు.

పివిటిజిల సంక్షేమానికి కత్తెర

- అంత్యోదయ రేషన్ కార్డులకు మంగళం
- సిసిడిపి నిధులన్నీ పక్కదారి
- అతీగతిలేని కేంద్రం కేటాయించిన నిధులు
- వైసిపి ప్రభుత్వం తీరుతో కుంటుబడిన అభివృద్ధి
- 18న ధర్నాకు ఆదివాసీ గిరిజన సంఘం సన్నద్ధం



జి.మాడుగులో సన్నాహక సమావేశంలో ధర్నా పడాల్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - పాడేరు టౌన్ : అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నవరత్నాలు, సంక్షేమ పథకాల పేరుతో మోసగిస్తున్న వైసిపి ప్రభుత్వం, పివిటిజిల (ప్రిమిటివ్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్) సంక్షేమానికి కూడా కత్తెర వేసింది. అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఎ పరిధిలో పివిటిజిల సమస్యలపై ఆదివాసీ గిరిజన సంఘం పోరాటానికి ఉద్యుక్తం చేస్తోంది.

పాడేరు ఐటిడిఎ పరిధిలో కోదు, పోర్జ, గదబ తెగల పివిటిజిలు సుమారు 244 పంచాయతీల్లో 1664 గ్రామాల్లో సుమారు లక్ష 75 వేల మంది ఉన్నారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పివిటిజిలకు అంత్యోదయ కార్డులు రద్దు చేయడం దుర్మార్గమని పివిటిజి నాయకులు, గిరిజన సంఘం నాయకులు విమర్శిస్తున్నారు. అత్యంత నిరుపేదలు, వికలాంగులు, ఎలాంటి ఆధారం లేని వృద్ధులు, వితంతువులకు ఆసరాగా ఉండాలనే లక్ష్యంతో అంత్యోదయ కార్డులను మంజూరు చేసిన గత ప్రభుత్వాలు, కుటుంబ సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా ఒక్కో కుటుంబానికి 35 కేజీల చొప్పున బియ్యాన్ని అందజేశారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అంత్యోదయ కార్డులకు మంగళం పాడేసి, నిరుపేదలు, ఏ దిక్కులేని కుటుంబాలకు అన్యాయం చేసిందని ఆదివాసీ గిరిజన సంఘంనేతలు మండిపడుతున్నారు. అర్హులైన పివిటిజిలకు అంత్యోదయ కార్డుల తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

సిసిడిపి నిధులతో పివిటిజిల రాయితీపై వ్యక్తిగత రుణాలు, గిరిజన గ్రామాల్లో సిసి రోడ్లు, మంచినీటి సౌకర్యాలు, కమ్యూనిటీ హాళ్లు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం వంటి వంటి సామాజిక అభివృద్ధి పనులుచేపట్టాల్సి ఉంది. అయితే జగన్ ప్రభుత్వం సిసిడిపి నిధులన్నీ దారి మళ్లించి, మన్యవాసులకు తీరని అన్యాయం చేస్తోందని నేతలు మండిపడుతున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వ్యవసాయ పరికరాలు, వాణిజ్య పంటల యంత్రాలు, మిరియాల నిచ్చెనలు పూర్తిగా సబ్సిడీతో పంపిణీ చేయలేదు. పివిటిజిలకు కేంద్ర ప్రభుత్వం 2023-25 సంవత్సరాలకు రూ.15 వేల కోట్లు ప్రకటించిందని, పాడేరు ఐటిడిఎ పరిధిలో ఎంత కేటాయించారో నేటికి సమగ్ర సమాచారం లేదని నేతలు ఆరోపిస్తున్నారు. కేటాయించిన నిధులు పివిటిజిలకే ఖర్చు చేయాలని, లేదంటే, పివిటిజిల సమస్యల పరిష్కారం చేయకపోతే పోరాటం తప్పదని హెచ్చరిస్తున్నారు.

18న ధర్నాకు సన్నద్ధం

పివిటిజిల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 18న ధర్నా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పివిటిజిలు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఆదివాసీ గిరిజన సంఘం నేతలు సన్నద్ధం చేస్తున్నారు. ఈ ధర్నాను జయప్రదం చేసేందుకు ఇప్పటికే ఆదివాసీ గిరిజన సంఘం ప్రచారం చేపట్టారు.

పివిటిజిల నిధుల దారి మళ్లింపు దారుణం



ఆదివాసీ గిరిజనుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పివిటిజిలకు కేటాయించిన నిధులను వారికి ఖర్చు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడం దారుణం. పివిటిజిల గ్రామాల్లో సిసి రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలి. సబ్సిడీ తగ్గించడంతో ఎక్కువమంది పివిటిజిలు ఆర్థిక ఇబ్బందులతో పథకాలు తీసుకోవడం లేదు.

కొర్రా బాలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు, ఆదివాసీ గిరిజన సంఘం

ఆదిమ తెగల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



పివిటిజిల (ఆదిమ గిరిజన తెగ) స్థితిగతులపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపాలి. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. ఇంటర్నెట్, విద్యుత్, వైద్యం, తాగునీరు, అంగన్వాడీలు, పాఠశాలలు, జన్‌ధన్ వికాస్ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు సద్వినియోగమయ్యేలా చూడాలి. పివిటిజిలకు స్వయం ఉపాధి పథకాలు అందించాలి

పాంగి బాలదేవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆదివాసీ గిరిజన సంఘం

అంత్యోదయ కార్డుల రద్దు అన్యాయం



పివిటిజిలకు అంత్యోదయ కార్డులు రద్దు చేయడం దుర్మార్గం. వాటిని వెంటనే పునరుద్ధరించాలి. నిరుపేదలు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఆసరాగా నిలవాలి. పివిటిజిలకు నిధులు కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. పివిటిజిల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి.

పాలికి లక్కు, జిల్లా సహాయ కార్యదర్శి, ఆదివాసీ గిరిజన సంఘం

పివిటిజిలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాలు



ఐటిడిఎ పరిధిలో11 మండలాల్లో పివిటిజిల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయి. వారికి ప్రత్యేక నిధులు కేటాయించకుండా తీవ్ర అన్యాయం చేస్తోంది. పివిటిజిల అభివృద్ధికి సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలి. కేంద్రం కేటాయిస్తున్న ప్రత్యేక నిధులు సక్రమంగా వినియోగించాలి.

కొర్రా నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు, ఆదివాసీ గిరిజన సంఘం

అమరవీరుల త్యాగాలను మరవొద్దు

ప్రపంచమే రాష్ట్రం వైపు చూసేలా ఎపి అభివృద్ధి
77వ స్వాతంత్ర్య దినోత్సవ సభలో మంత్రి అమర్‌నాథ్



పాడేరులో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి- పాడేరు: స్వతంత్ర భారతావని కోసం ఎంతోమంది ప్రాణార్పణ చేశారని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం 77వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా స్థానిక తలారిసింగి పాఠశాల మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సాధనకు ప్రాణత్యాగం చేసిన అమరులకు నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి, అతని అనుచరులు గాం గంటందొర, గాం మల్లు దొర, మగ్రి కామయ్య, పండు పడాల్ వంటి ఎందరో వీరుల త్యాగాలతో నేడు స్వేచ్ఛ వాయువులను పీల్చుతున్నామన్నారు.

దేశానికే ఆదర్శంగా, ప్రపంచమే మన వైపు చూసేలా రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్, జగనన్నకు చెప్పుకుందాం, జగనన్న సురక్ష, గడపగడపకు మన ప్రభుత్వం వంటి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయిస్తే, అల్లూరి జిల్లాలో రూ.40 లక్షల చొప్పున మంజూరు చేసి గిరిజనంపై తనకున్న అభిమానాన్ని సిఎం చాటుకున్నారన్నారు.

జగనన్న ఆణిముత్యాలు పథకం కింద జిల్లా, నియోజకవర్గం, పాఠశాల స్థాయిలో పది ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన 750 మంది విద్యార్థులకు రూ.19.84 లక్షల నగదు ప్రోత్సాహకం అందజేశారన్నారు. జగనన్న గృహనిర్మాణంలో జిల్లాలో తొలివిడతగా 17,111ఇళ్లను మంజూరు చేయగా, 337గృహాల నిర్మాణం పూర్తయ్యా యన్నారు. మహిళలకు ఆర్థిక ఆసరాకు 1,719 స్వయం సహాయక సంఘాలకు రూ.73.3 కోట్ల బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా 1,818సంఘాలకు రూ.9.15 కోట్ల రుణాలు, సున్నా వడ్డీ పథకం కింద 12,818 సంఘాలకు రూ.19.26 కోట్ల లబ్ధి చేకూర్చారన్నారు. నాడు నేడు రెండో విడతలో రూ. 20.96 కోట్లతో 130 అంగన్వాడీ భవనాలను మంజూరు చేశామన్నారు. మిషన్ కనెక్ట్ పాడేరు కింద 972 డోలీ గ్రామాలతో సహా రహదారి సౌకర్యం లేని 1,648 గ్రామాలకు మూడేళ్లలో రహదారుల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.732 కోట్లతో ప్రతిపాదన సిద్ధం చేశామని, తొలివిడతలో 514 గ్రామాలకు రూ. 274 కోట్లతో 960 కిలోమీటర్ల రహదారి పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. రూ.526 కోట్లతో లక్ష ఎకరాల్లో కాఫీ సాగులో భాగంగా ఇప్పటివరకు 84 వేల ఎకరాలలో కాఫీ తోటలు వేశామన్నారు. ఈ ఏడాది 14,500 మంది గిరిజన రైతులు లబ్ధిచేకూరేలా మరో 16వేల ఎకరాలు కాఫీ సాగు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

రంపచోడవరం ఐటిడిఎ పరిధిలో 25,145 గిరిజన కుటుంబాలకు 73,200 ఎకరాలు, చింతూరులో 4,348 మందికి 16,714 ఎకరాలకు భూమి హక్కు పత్రాలను పంపిణీ చేశామని, పాడేరు ఐటిడిఎ పరిధిలో పదో విడతలో 2500 మందికి 4500 ఎకరాల భూమి పంపిణీ చేస్తామన్నారు. గోదావరి, శబరి ముంపు ప్రభావిత ప్రాంతాల్లో తాజాగా సర్వే నిర్వహించి, 48 గ్రామాలను ముంపు గ్రామాల జాబితాలో చేర్చామన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ జె .శివ శ్రీనివాస్, పాడేరు ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఐటిడిఎ పిఒ వి .అభిషేక్, జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా,రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ నర్సింగరావు డిఆర్ఒ అంబేద్కర్, ఐటిడిఎ ఎపిఒలు విఎస్ ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఐ.కొండలరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రభుత్వ కార్యాలయాల్లో పతాకావిష్కరణలు

స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటిడిఎలో పిఒ అభిషేక్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి తుహిన్ సిన్హా జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి, గాంమల్లుదొర విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు, విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

రంపచోడవరం : స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణంలో 77వ స్వతంత్ర్య వేడుకలు సందర్భంగా మువ్వన్నెల జెండాను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ వారి బానిసత్వం నుండి దేశాన్ని విముక్తి చేసిన నాటి త్యాగమూర్తులను గుర్తు చేసుకుంటూ దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకొనే బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఏఎస్పీ జగదీష్, జిల్లా ఫారెస్ట్ అధికారి జి.నరేంద్రన్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్, ఎంపీపీ బంధం శ్రీదేవి, జడ్పిటిసి సభ్యురాలు పండ వెంకటలక్ష్మి, రంపచోడవరం సర్పంచ్ మంగ బుజ్జయ్య, వైస్ ఎంపీపీలు కె. బాలకృష్ణ, పండా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఐటిడిఎ, సబ్ కలెక్టర్ కార్యాలయాల వద్ద

రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అధికారులు, సిబ్బందితో కలిసి జాతీయ పతాకాన్ని ఎగరవేశారు.

ఉత్తమ సేవా పురస్కారాల ప్రదానం









మంత్రి చేతుల మీదుగా అవార్డులు స్వీకరిస్తున్న రాజవొమ్మంగి తహశీల్దారు సుబ్రహ్మణ్య ఆచారి, అడ్డతీగల ఎస్ఐ అప్పలరాజు, కొయ్యూరు సిడిపిఒ విజయకుమారి, వైద్యుడు

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించినందుకు గాను పలువురు అధికారులకు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మంగళవారం జరిగిన 77వ స్వాతంత్ర్య దినోత్సవంలో ఉత్తమ సేవా పురస్కారాలను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు.

రాజవొమ్మంగి : మండల తహశీల్దార్ సుబ్రహ్మణ్యఆచారి మంత్రి చేతులమీదుగా, ఎస్ఐ టీజీ నరేంద్ర ప్రసాద్ జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. పశువైద్యాధికారి తరుణ్ కుమార్ రంపచోడవరంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఐటిడిఏ పిఒ సూరజ్ గనోరే చేతుల మీదగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

కొయ్యూరు : కొయ్యూరు సీఐ స్వామి నాయుడు, ఎస్సై రాజారావు, ఉత్తమ ఐసిడిఎస్ సిడిపిఒగా ఎంపికైన విజయకుమారి మంత్రి అమర్నాథ్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. మంప ఎస్సై లోకేశ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ శ్రీను జిల్లా ఎస్‌పి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు స్వీకరించారు.

సీలేరు : జికె.వీధి మండలం సీలేరు ఎస్సై రామకృష్ణకు జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా కానిస్టేబుల్ జి.సత్యనారాయణకు మంత్రి అమరనాథ్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు.

అడ్డతీగల : అడ్డతీగల ఎస్సై అప్పలరాజు మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. కానిస్టేబుల్ దేవుడు, కోటి రాంబాబుకు సేవా పురస్కారాలు అందజేశారు.




ఎస్‌పి నుంచి అవార్డు అందుకుంటున్న సీలేరు ఎస్ఐ

308 మందికి ఉత్తమ ప్రతిభా అవార్డులు

పాడేరు : 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని పాడేరు, చింతూరు రంప చోడవరం ఐటిడిఎల పరిధిలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉన్నతాధికారులు, ఉద్యోగులు 308మందికి మంగళవారం పాడేరులోనిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అవార్డు కింద ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉత్తమ అవార్డులు అందుకున్న వారిలో జిల్లా రెవెన్యూ అధికారి పి అంబేద్కర్, కలెక్టర్ సిసిలు ఎస్‌కె భాషా, వి చంద్రశేఖరరావు, సీనియర్ అసిస్టెంట్ సతీష్ కుమార్, డ్రైవర్ టి రాంప్రసాద్, పిఎస్ఒ త్రినాధరావు, బి శివప్రసాద్‌ఉన్నారు. వీరితోపాటు పాడేరు చింతూరు రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయాల పరిధిలో 35 మంది అధికారులు ఉద్యోగులకు. ఆయా ఐటిడిఎల పరిధిలో పనిచేస్తున్న 16 మంది అధికారులు ఉద్యోగులకు మంత్రి అమర్నాథ్ ప్రశంస పత్రాలను అందజేశారు. మూడు ఐటిడిఎల పరిధిలో డిడి గిరిజన సంక్షేమ విద్య శాఖ కార్యాలయాల్లో చేస్తున్న 9 మంది అధికారులకు మండల స్థాయిలో మండల పరిషత్, పంచాయతీ కార్యాలయాల్లోని 30 మందికి 104, 108, 102, సేవల సిబ్బంది 25 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. డిఆర్‌డిఎ, పోలీస్, వ్యవసాయ ఉద్యాన, అటవీ, నీటిపారుదల, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్‌అండ్‌బి ఎపిఇపిడిసిఎల్, కాఫీ బోర్డు,జిసిసి తదితర శాఖల అధికారులు ఉద్యోగులు ప్రశంసాపత్రాలను అందుకున్నవారిలో ఉన్నారు.

ఎపిఇపిడిసిఎల్ జెఇకి..

ఎటపాక : ఎటపాక మండలం ఎలక్ట్రికల్ జెఇ జి.రాజ్‌కపూర్ ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృధ్వీతేజ్ ఇమ్మడి చేతుల మీదగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. వరదల సమయంలో మండలంలో విద్యుత్తు శాఖ సిబ్బందిని సమాయత్తం చేసి విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా సేవలు అందించినందుకు ఈ పురస్కారం లభించింది.



అవార్డు అందుకుంటున్న ఇపిడిసిఎల్ జెఇ రాజ్‌కపూర్

లైబ్రేరియన్ సునీతకు అవార్డు

డుంబ్రిగుడ : స్థానిక శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ ఎస్ సునీతకు 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ ప్రతిభ అవార్డు దక్కింది. విశాఖపట్నంలో రాష్ట్ర మంత్రి విడదల రజని, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున్ మంగళవారం సునీతకు అవార్డును అందజేశారు. డుంబ్రిగుడలోపాటు అనంతగిరి, అరుకులోయ మండలాల్లోని శాఖా గ్రంథాలయాలకు ఇన్‌ఛార్జి బాధ్యతను సమర్థవంతంగా సేవలు అందించడాన్ని గుర్తించి అవార్డుకు ఎంపికచేశారు. ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్న సునీతను గ్రంథపాఠకులు, పలువురు అభినందించారు.



అవార్డు అందుకుంటున్న సునీత

18న పివిటిజిల సమస్యలపై చలో ఐటిడిఎకు తరలిరండి

ప్రజాశక్తి -సీలేరు

పివిటిజిల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న జరుగు చలో పాడేరు ఐటిడిఎ కార్యక్రమానికి తరలిరావాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా నాయకులు అంపరంగి బుజ్జిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జికె.వీధి మండలం దారకొండ, గుమ్మిరేవులు, దుప్పిలివాడ పంచాయతీలకు చెందిన పిటీజీ గిరిజనులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పిటిజి గ్రామాల అభివృద్ధికి కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందని తెలిపారు. పిటిజీ గిరిజన గ్రామాలు నేటికీ అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. ప్రభుత్వ మెడలు వంచి గిరిజనులకు కేటాయించిన నిధులు గిరిజన గ్రామాలకు ఖర్చు పెట్టే విధంగా పోరాడి సాధించుకుంటామని స్పష్టం చేశారు. ఈనెల 18న తలపెట్టిన చలో ఐటిడిఏ కార్యక్రమానికి పెద్ద ఎత్తున గిరిజనులు తరలి వచ్చి మన హక్కులపై పోరాడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు బాకూరి కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, అప్పారావు, బాబురావు, గిరిజనులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బుజ్జిబాబు

ఊపందుకున్న వరినాట్లు

ప్రజాశక్తి-విఆర్.పురం

వరదలు తగ్గి 15 రోజులైన క్రమంలో మండలంలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. సన్న చిన్నకారు రైతులు సాగుబడికి సన్నద్ధమయ్యారు. మైనర్, మేజర్ చెరువుల ఆయకట్టు కింద గతవారం రోజులు నుండి రైతులు వరి నాట్ల పనిలో బిజీ బిజీగా ఉన్నారు. జులై నెలలో విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువులు నిండు కుండను తలపించే విధంగా ఉన్నాయి. కొన్ని చెరువులు గోదావరి నీటితో కలకలలాడుతున్నాయి. చెరువుల కింద ఆయకట్టుకు నీరు డోకాలేదు. అయితే వర్షాధార పొలాల్లో మాత్రం కొంత నీటి వెతలు పడాల్సి ఉంటుందని పలువురు అవేదన వ్యక్తం చేస్తున్నారు. చెలకలు, మెట్ట బోర్లు గల భూమిలో కూడా వరి చల్లుతారు. వాటికి మాత్రం ప్రస్తుతం నాట్లు వేయాలంటే కొంత ఇబ్బందులు తప్పడం లేదు. ఆగస్టు ప్రారంభమై 15 రోజులైనా అరకొరగా అడపాదడపా జల్లులు కురుస్తున్నాయని, ఇప్పుడు వర్షాలు పడతే మండల వ్యాప్తంగా వరి నాట్లు పూర్తి స్థాయిలో జరుగుతాయని రైతులు చెబుతున్నారు.



వరి నాట్లు వేస్తున్న గిరిజన రైతులు

ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌కు సన్మానం

ప్రజాశక్తి- చింతూరు

చింతూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు. తొలుత ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మంత్రి సత్యనారాయణ, సీనియర్ పాత్రికేయులు భాస్కరాచారి జాతీయ జెండాను ఆవిష్కరించారు. గాంధీ విగ్రహానికి పూలమాలను వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సన్మాన గ్రహీత డాక్టర్ జమాల్ ఖాన్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు భారతదేశ స్వతంత్ర్య పోరాటంలో అశువులు భాసి బ్రిటిష్ వారి బానిస సంకెళ్ల నుండి దేశాన్ని విముక్తి చేశారని తెలిపారు. నేటి సమాజంలో మీడియా ప్రాముఖ్యత పెరిగిందని, పాత్రికేయ వృత్తి కత్తి మీద సాము లాంటిదని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే ఒక గొప్ప వృత్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు చదలవాడ విజయ్ కుమార్, షౌకత్ అలీ, చంటి, ప్రేమనాథ్, బెజ్జంకి శ్రీనివాసాచారి, ఈశ్వరచారి, జీవన్ కుమార్, సాగర్, రేపు సతీష్, టింకు లక్ష్మణ్, నరేష్ ఉదయ్, ఎస్కె షాజహాన్ పాల్గొన్నారు.



ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్‌ను సన్మానిస్తున్న పాత్రికేయులు

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు


అనంతగిరిలో జెడ్‌పిటిసి గంగరాజు తదితరులు

అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

అనంతగిరి :స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శెట్టి నీలవేణి, స్థానిక సచివాలయం, మండల పరిషత్ పాఠశాలలు, కాలేజీల్లో సర్పంచ్ రూతు, జెడ్‌పిటిసి దీసరి గంగరాజు జాతీయపతాకాలను ఆవిష్కరించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఎంపిడిఒ వివి.కుమార్, బాలాజీ ఎటిడబ్ల్యుఒ, వెంకటరావు మండల కోఆప్షన్ మెంబర్ మదీనా, పాఠశాలల హెచ్ఎంలు బి.మంగ, విమల, అప్పలస్వామి పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిపి బి ఈశ్వరి, మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ సిహెచ్ నాగమ్మ, పోతంగి సచివాలయంలో సర్పంచ్ వెంకటరావు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాల్లో జాతీయపతాకావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సిహెచ్ జానకమ్మ, ఎంపిడిఒ ఉషారాణి, ఎంఇఒ శెట్టి సుందరావు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అరకులోయ : పెద్దలబుడు మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, ఇఒ రాజ్‌కుమార్, మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నగేష్ ఆధ్వర్యంలో ఎంపిపి ఉషారాణి, తహశీల్దార్ కార్యాలయంలో జెడ్‌పిటిసి శెట్టి రోషిణి, మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒ వి. త్రినాధరావు, వివిధ ప్రభుత్వకార్యాలయాలు, పాఠశాలల్లో సంబంధిత శాఖల అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పద్మాపురం మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పెట్టెలి సుస్మిత, కొత్తబల్లు గుడలో సర్పంచ్ రాధిక, సెరికల్చర్ కమిటీ చైర్మన్ కొర్ర విజయరాణి, గద్యగుడ అంగన్వాడి కేంద్రంలో పొద్దు లలిత కుమారి ఆధ్వర్యంలో ఎంపిటిసి స్వాతిలక్ష్మి జాతీయజెండాను ఆవిష్కరించారు. పెదలబుడు పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను దుశ్శాలువాతో సత్కరించి, నిత్యావసరాలు అందజేశారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సుబీల్, ఎంపిటిసీలు దుర్గా ఆనంద్ కుమార్, ఎలిబి భీమరాజు, కోఆప్షన్ సభ్యులు రహీంతుల్లా, స్వామి రామ్మూర్తి, వ్యాపారవేత్త మయూరి రాజారావు పాల్గొన్నారు.

జి.మాడుగుల : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాస్, తహశీల్దార్ కార్యాలయంలో డిటి అప్పలస్వామి, జి.మాడుగుల సచివాలయంలో సర్పంచ్ రాంబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పలు కార్యాలయాల్లో, పాఠశాలల్లో జెండా పండుగ ఘనంగా జరిగింది.

హుకుంపేట: . మండలంలోని ఉప్ప గ్రామంలో యునైటెడ్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జాతీయజెండాను నేషనల్ ప్రేయర్ ఫెలోషిప్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ బాలకృష్ణ, కె.జేమ్స్ వి.మోజెస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వైస్ ఎంపిపి -1 పోయి సత్యనారాయణ, మండల పరిషత్‌లో ఎంపిడిఒ రమేష్, రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ నర్సమ్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇంకా పోలీస్‌స్టేషన్, పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో గిరిజన సంక్షేమ విద్యార్థుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

వి.ఆర్.పురం : స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఎంపిపి కారం లక్ష్మి, రేఖపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ పూనెం సరోజిని గాంధీజీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి, త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లలోనూ జాతీయ జెండాలను ఎగరవేశారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ ఎస్.శ్రీధర్, ఎంపిడిఒ, జెడ్‌పిటిసి వాళ్ల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వి.ఆర్.పురంలో...


హుకుంపేటలో...

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్న మాణిక్యం త్రివర్ణ పతకాన్ని ఎగుర వేశారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.వెంకట్రావు, డాక్టర్ వై.పద్మ ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెంలోని ఏపీ జెన్కో సర్కిల్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ బొడ్డేటి శ్రీధర్ జెండా ఆవిష్కరించారు. డివిఏ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. మోతుగూడెం పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలు, యూనియన్ ఆఫీస్‌లో జెండా ఆవిష్కరణలు జరిగాయి.

రాజవొమ్మంగి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, ఎంపీడీవో యాదగిరిశ్వరరావు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి, రాజవొమ్మంగి, జడ్డంగి పోలీస్ స్టేషన్లలో ఎస్సైలు జాన్ కుమార్, రఘునాధరావు, జెడ్‌పి హైస్కూల్‌లో చైర్మన్ వీరబాబు, అటవీశాఖ రేంజ్ కార్యాలయంలో రేంజర్ అబ్బాయిదొర, కేశవరంలో ఏపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు చప్పా చంద్రరాణి, రాజేశ్వరి, వైసిపి నాయకులు సింగిరెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో...

అడ్డతీగల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాఘవ, ఎంపీడీవో బాపన్నదొర, తహశీల్దారు కార్యాలయం వద్ద తహశీల్దారు తాతారావు, పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పప్పులు చిట్టెమ్మ జాతీయ జెండాలను ఎగరవేశారు.

కూనవరం : మండలంలోని కూటూరు పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ బొగ్గా వెంకమ్మ జెండా ఎగుర వేశారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పాయం సీతారామయ్య, మాజీ ఎంపీటీసీ మేకల నాగేశ్వరరావు, రమేష్ రాంబాబు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జయంతి, ఎంపిపి పాఠశాలలో హెచ్ఎం వీణదేవి, సర్పంచ్ కొండ జాకప్, ఆశ్రమ బాలుర పాఠశాలలో మడకం రామారావు, పిహెచ్‌సిలో డాక్టర్ హరికృష్ణ, కెజిబివిలో స్పెషలాఫీసర్ మయూరి లక్ష్మి, టిడిపి కార్యాలయం వద్ద డాక్టర్ పల్లల రాజ్ కుమార్‌రెడ్డి జెండా ఆవిష్కరణలు చేశారు. టిడిపి నాయకులు గురుకు శేషు కుమార్, పొడియం శీను బాబు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం దేవమణి, స్థానిక పోలీస్ స్టేషన్లో సిఆర్పిఎఫ్ జి42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సురేష్ జెండా ఆవిష్కరణలు చేశారు. జెడ్‌పి హైస్కూల్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. సీలేరు, దారకొండ, దుప్పులవాడ గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద, పలు పాఠశాలల్లోనూ జెండా ఆవిష్కరణలు జరిగాయి.


రాజవొమ్మంగిలో...


మోతుగూడెంలో...


జి.మాడుగులలో...


సీలేరులో...


మారేడుమిల్లిలో...

ఆకట్టుకున్న ప్రదర్శనలు


స్వాతంత్ర్య వేడుకల్లో విద్యార్థుల విన్యాసాలు

పాడేరు : స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా, మంత్రి అమర్‌తోపాటు కలెక్టర్, పిఒలు గౌరవవందనం స్వీకరించారు. విద్యార్థుల క్రీడా విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సాంస్కృతిక ప్రదర్శనల్లో పాడేరు కెజిబివి మొదటి స్థానం, కొయ్యూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల (రెజ్లింగ్) ద్వితీయస్థానం, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల (లోచలిపుట్టు) తతీయ స్థానాల్లో నిలిచారు. మార్చ్ ఫాస్ట్‌లో తలారిసింగి బాలురు, హుకుంపేట బాలురు, శ్రీకృష్ణాపురం బాలికల పాఠశాలలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచాయి. శకటాల ప్రదర్శనలో డిఆర్‌డిఎకల్యాణమస్తు శకటం ప్రథమస్థానం, హార్టీకల్చర్ శకటం ద్వితీయ స్థానం, విద్యాశాఖ శకటం తతీయ స్థానంలో నిలిచాయి. పోలీసు శునకాలు రాబిన్, సిరి, రాకీ ప్రదర్శనలు అబ్బురపరిచాయి. మంత్రి అమర్, కలెక్టర్ సుమిత్‌కుమార్‌లకు అభివాదం చేసి, షేక్ హ్యాండ్ ఇచ్చి శునకాలు బుద్ధి కుశలత, నైపుణ్యం చాటాయి.

కన్నవరంలో మొదటిసారి ఎగిరిన జాతీయ జెండా

కొయ్యూరు : మండలంలోని మారుమూల బూదరాళ్ళ పంచాయతీ పరిధి కన్నవరం గ్రామంలో స్వాతంత్ర్య వచ్చి 76 ఏళ్లలో మొదటి సారి జాతీయ జెండా ఎగిరింది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు దిలీప్ కుమార్, గ్రామ యువకులు, విద్యార్థులు జెండాను ఎగరవేశారు. ఇంకా మండల కేంద్రంలో ఉన్న పాఠశాలల్లోనూ జాతీయ జెండాలను ఎగరవేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

శరభగూడలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన...

అరకులోయ : స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా మండలంలోని శరభగూడలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మగ్గన్న ఆధ్వర్యంలో గ్రామ పెద్ద పాంగి రాము జాతీయ జెండాను ఆవిష్కరించారు. సంఘం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని. రాజ్యాంగం పరిరక్షణకు ముందుగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి 76 ఏళ్లు పూర్తయినా నేటికీ గిరిజన గ్రామాలు అభివృద్ధి, గిరిజన చట్టాలు, హక్కులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. దేశంలో, రాష్ట్రంలో గిరిజనులు, మహిళలలపై దాడులు, అత్యాచార ఘటనలకు మణిపూర్ ఉదంతాలే నిదర్శనమన్నారు. గిరిజనమంతా సంఘటితమై ఉద్యమించకుంటే మణిపూర్ తరహా పరిస్థితులు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ప్రసన్న, సురేష్, జగన్నాథం, కిలో ఆనంద్ పాల్గొన్నారు.


గిరిజనులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పొద్దు బాలదేవ్



అమరులకు నివాళులర్పిస్తున్న ఎంపిటిసి సన్యాసిదొర

పెద లువ్వాసింగిలో 'నా భూమి - నా దేశం'

ప్రజాశక్తి-జి.మాడుగుల : మండలంలోని పెదలువ్వాసింగి పంచాయతీ సచివాలయం ఆవరణలో నా భూమి నా దేశం, నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు స్థానిక ఎంపిటిసి గబ్బాడి సన్యాసి దొర, సచివాలయం కన్వీనర్,మాజీ సర్పంచ్ గబ్బాడి పండుదొర, ఉప సర్పంచ్ గబ్బాడి గణపతి, పంచాయతీ సెక్రెటరీ లకే భానుప్రకాష్,. వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొని, అమరవీరులు, త్యాగధనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించి, నివాళులర్పించారు.

వంద మంది గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి- అరకులోయ :స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రణజిల్లెడ సమీపంలోని ఒక రిసార్ట్‌లో వంద మంది గిరిజన వృద్ధులకు అడ్వకేట్స్ అసోసియేషన్ పర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్ (ఆసర) వ్యవస్థాపకులు న్యాయవాదులు పి.రత్నరాజు, అబీబ్, సుల్తాన్ అలీ ఆధ్వర్యంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గిరిజనులకు న్యాయపరంగా, సామాజికపరంగా సేవ చేయాలన్న సంకల్పంతో అడ్వకేట్స్ అసోసియేషన్ ఏర్పడడం సంతోషమన్నారు. అసోసియేషన్ సేవలు మరింతగా విస్తరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ఫాల్గుణను అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు. అలాగే పద్మాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి సుస్మిత, వైస్ ప్రెసిడెంట్ భగత్‌రాం, ఎంపిటిసిలు, వార్డు సభ్యులను కూడా సత్కరించారు. కార్యక్రమంలో అడ్వకేట్ అసోసియేషన్ ప్రతినిధులు మహమ్మద్ షహీన్,సాజిద్ మాలిక్, నరసింగరావు, జయదేవరాజు, శివకుమార్, మధుసూదనరావు, ఉదయ్ వంశీ పాల్గొన్నారు.అంతకుముందు మండలంలోని సిఎహెచ్ స్కూల్‌లో జాతీయజెండాను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆవిష్కరించారు.



గిరిజన వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఆసరా ప్రతినిధులు

విశాఖ బీచ్‌లో బాబు షో

-అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు ఉచితమంటూ ప్రకటన
-ఎపి సిఎం బటన్ నొక్కడం వల్ల ఎవరికి మేలని ప్రశ్న
- ఆర్థిక సంస్కరణలు, నోట్ల రద్దుపై సమర్థన
- 2047 విజన్ డాక్యుమెంట్‌లో 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్'కు దక్కని స్థానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ బీచ్‌లో మంగళవారం సాయంత్రం చంద్రబాబు నిర్వహించిన రోడ్ షో, సభ పూర్తిగా రాజకీయ పరమైన విమర్శలు, ఆరోపణలతో సాగాయి. విశాఖను ఆర్థిక నగరంగా అభివృద్ధి చేసే ప్రణాళికలను తాను అధికారంలో ఉన్నప్పుడే చేశానని బాబు అన్నారు. తర్వాత హుదూద్ వచ్చినప్పుడు 10 రోజులు ఇక్కడే తాను ఉండి విశాఖను బాగు చేశానన్నారు. 2019 ఎన్నికల్లో నలుగురు ఎంఎల్‌ఎలను ఇచ్చిన ఘనత విశాఖదంటూ కొనియాడారు. అలాంటి విశాఖలో తన 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. దేశం ఆర్థిక రంగంలో దూసుకుపోతోందంటూ ఊదరగొట్టారు. కాగా, ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయమైన విశాఖలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ధ్వంసం చేసే కేంద్ర ప్రభుత్వ విధానంపై మాత్రం బాబు తన ప్రసంగంలో కనీస స్థాయిలో ప్రస్తావించలేదు. ఈ ప్రాంత అభివృద్ధికి మూలమైన స్టీల్‌ప్లాంట్, అది సృష్టిస్తున్న ఆర్థిక సంపద, ప్రైవేటీకరణతో కోల్పోతున్న గాజువాక ప్రాంత తలసరి ఆదాయ లెక్కలు మాత్రం తన విజన్ 2047లో బాబు చూపించలేకపోవడం ఈ డాక్యుమెంట్‌లో ఒక వైఫల్యంగానే చెప్పొచ్చు. సభకు హాజరైన వారి నుంచి బాబు ప్రసంగానికి కనీస స్థాయిలో కూడా స్పందన రాకపోవడం కనిపించింది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాన్ని, జగన్‌ను దూషించిన సందర్భంలోనూ ఎలాంటి స్పందనా రాలేదు.

రాజకీయ సభ కాదంటూనే...

పూర్తిగా తన ఈ పర్యటన నాన్ పొలిటికల్ అంటూ తొలుత చెప్పిన చంద్రబాబు మంగళవారం జాతీయ జెండాలను తమ పార్టీ కార్యకర్తల చేత పట్టించి పూర్తిగా రాజకీయ ప్రసంగాలు, రాష్ట్రంలో సంక్షేమ పథకాలపై వ్యంగ్య వ్యాఖ్యానాలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను గాడిలో పెట్టడానికే తాను ఇక్కడకు వచ్చి విజన్-2047 డాక్యుమెంట్‌ను ప్రవేశపెడుతున్నాని వెల్లడించడం విశేషం. తాను 2024లో అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు ఉచితం అంటూ ప్రకటించారు. స్వాతంత్ర్యం వచ్చినా అవినీతి, నేరాలు దేశంలో పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1991లో పివి హయాంలో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలను బాబు కొనియాడుతూ మరో వైపు మోడీ ప్రవేశపెట్టిన నోట్ల రద్దును సమర్థిస్తూ.. కొంతమంది దీన్ని వ్యతిరేకించారని విమర్శ చేశారు. దేశం, రాష్ట్రంలో పలు రుగ్మతలతో పేదరికం పెరిగిపోతోందని, 2047 డాక్యుమెంట్ ప్రకారం వెళితే అన్ని సమస్యలూ తీరిపోతాయని అన్నారు. రాష్ట్రంలో రివర్స్ పాలన సాగుతోందని, పోలవరాన్ని గోదావరిలో కలిపేసింది కాక ఈ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును కేంద్రం చేయాలని 'కొత్త రాగం' తీస్తుందంటూ ఎద్దేవా చేశారు. ఐటికి గమ్యస్థానంగా హైదరాబాద్‌ను మార్చింది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమని చెప్పారు.


విజన్ - 2047 డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు

ఇంటర్నెట్, టెక్నాలజీపైనా పాత పాటే..

మెషిన్ టెక్నాలజీ, ఎఐ, రోబో టెక్నాలజీలతో ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటూ పాత చింతకాయ పచ్చడినే చంద్రబాబు తన ప్రసంగంలో వడ్డించడం విశేషం. తాను అధికారానికి వస్తే రాష్ట్రంలోని అన్ని మండలాల్లోనూ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అమలు చేస్తానంటూ హామీ ఇచ్చారు. అమరావతి రాజధానిగా ఉండాలని విశాఖ ప్రజలూ కోరుకుంటున్నారని, విశాఖ ప్రజలు చాలా మంచివారని అన్నారు. అమరావతి కోసం రైతులు 32 వేల ఎకరాలను ఇచ్చారని రాజధాని ఇక్కడ వచ్చి ఉండి ఉంటే పేదరికం రాష్ట్రంలో తగ్గిపోయి ఉండేదన్నారు. ప్రసంగం అనంతరం ఇంటరాక్షన్ సెషన్‌లో పలువురు చంద్రబాబు ప్రవేశపెట్టిన విజన్ బాగుందంటూ వ్యాఖ్యానిస్తూ పలు ప్రశ్నలు వేశారు. ఎయులో అక్రమాలు, అవినీతి పెరిగాయని, వాటిని సరిచేయాలని ప్రొఫెసర్ జాన్ కోరారు. తుదకు ఈ కార్యక్రమంలో 30 మందే మిగలడం గమనార్హం. కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పీలా గోవింద సత్యనారాయణ, ఎం.శ్రీభరత్ పాల్గొన్నారు. కాగా ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు గైర్హాజరయ్యారు.

వార్డు మెంబర్‌గా సత్తిరెడ్డి ఏకగ్రీవం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలోని డివి.కోట పంచాయతీలోని ఒకటవ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి కాకూరు సత్తిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక ధ్రువీకకరణ పత్రాన్ని ఎంపీడివో చేతుల మీదుగా సత్తిరెడ్డి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేషుకుమార్, ప్రధాన కార్యదర్శి పోడియం శ్రీనుబాబు, ఉపాధ్యక్షులు కర్రి సన్యాసిరెడ్డి, ఎస్టీ కమిటీ ప్రధాన కార్యదర్శి విండెల గోపి, మాజీ మండల అధ్యక్షులు శీసెట్టి అప్పాజీ, ఉప సర్పంచ్ పల్లాల భూపతిరెడ్డి, టిడిపి ఉపాధ్యక్షులు కాశి గాని వంశీకృష్ణ, పెతకంశెట్టి రాము, తుమ్మిడి లక్ష్మీనారాయణ, ఏరుబండి రాంబాబు పాల్గొన్నారు..

నేటి నుంచి ఎపిఎల్ క్రీడా సంగ్రామం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

రాష్ట్రం నుంచి ఐపిఎల్‌కు క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకూ వైజాగ్‌లోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ, విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఎపిఎల్ - 2ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత ఏడాది నిర్వహించిన ఎపిఎల్ సీజన్ -1కు బాగా ఆదరణ దక్కడంతో సీజన్ 2ను ప్రతిష్టాత్మకంగా, మరింత ఆకర్షణీయంగా నిర్వహించేందుకు ఎసిఎ సిద్ధమైంది. ఈ క్రమంలోనే 'మన ఆంధ్ర మన ఎపిఎల్' పేరిట రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 3 కె రన్ చేపట్టారు. యువ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపేందుకు విజయవాడ, వైజాగ్‌ల్లో నిర్వహించిన మెగా రన్‌లో ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్.గోపీనాథ్ రెడ్డి పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఎపిఎల్ - 2 క్రికెట్ మ్యాచ్ ప్రారంభోత్సవానికి గౌరవ అతిథిగా హీరోయిన్ శ్రీ లీల హాజరై సందడి చేయనున్నారు. మ్యాచ్‌ను తిలకించేందుకు వచ్చిన వారికి ఉచితంగా ఇచ్చే టికెట్లపై పేరు, సెల్ నెంబర్ రాసి స్టేడియం వద్ద ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేస్తే లక్కీ డిప్ తీస్తారు. మ్యాచ్ ప్రారంభమయ్యే 16, 19, 20, 26, 27 తేదీల్లో రోజుకు ఐదుగురిని లక్కీ డిప్‌లో ఎంపిక చేసి, నవంబర్‌లో నిర్వహించనున్న ఇండియా వర్సెస్ ఆస్ట్రేలియా మ్యాచ్‌ను తిలకించేందుకు ఉచితంగా పాస్‌లు ఇస్తారు. అదేవిధంగా ఎసిఎ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్న కార్నివాల్‌లో ఫుడ్ ఫెస్టివల్, వివిధ రకాల గేమ్స్ ఉంటాయి.

స్వర్ణభారతిలో టేబుల్ టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఆగస్ట్ 16 నుంచి 22 వరకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా 50వ ఆల్ ఇండియా ఇంటర్ ఇన్‌స్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ 2023 పోటీలు జరగనున్నాయని విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ జనరల్ మేనేజర్ జిఎల్.వర్మ తెలిపారు. మంగళవారం సాయంత్రం నగరంలో ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీమ్ ఈవెంట్స్‌లో 16 పురుషుల జట్లు, 13 మహిళల జట్లు పాల్గొంటాయన్నారు. మొత్తం ప్రైజ్ మనీని రూ6.5లక్షలుగా నిర్ణయించామని తెలిపారు. ఏడు రోజుల ఈవెంట్లలో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో పోటీలు ఉంటాయని తెలిపారు. భారతదేశపు టాప్ ర్యాంకింగ్ ప్లేయర్లు అంటే మానికా బాత్రా, ఎస్.హెచ్. శరత్ కమల్, జి.సత్యన్, మానవ్ ఠక్కర్, స్నేహిత్, స్వస్తిక ఘోష్ తమ తమ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తూ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 16న ఉదయం 10 గంటలకు స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకను ముఖ్య అతిథిగా, జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున, ఎఎఐ - స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ ప్రెసిడెంట్ డాక్టర్ హెచ్.శ్రీనివాస్, ఎస్.హెచ్.కమలేష్ పాల్గొంటారని తెలిపారు.